సాక్షి
జగిత్యాల
సోమవారం । 14 । ఆగస్టు । 2023



నృసింహునికి మొక్కులు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. పూజలు చేసి మొక్కులు చెల్లించారు.



పరమేశ్వరా పాహిమాం

వేములవాడ: వరుస సెలవులు రావడంతో రాజన్నను ఆదివారం సుమారు 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆయకట్టుకు సాగునీరందిస్తాం



మంత్రి ప్రశాంత్‌రెడ్డితో నాయకులు

కథలాపూర్(వేములవాడ): జగిత్యాల– నిజామాబాద్ జిల్లాల సరిహద్దులోని రాళ్లవాగు ప్రాజెక్టు ద్వారా కథలాపూర్ మండలంలోని చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని మంత్రి ప్రశాంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. భూషణరావుపేటలోని రాళ్లవాగు ప్రాజెక్టు కుడికాలువ మరమ్మతులు, నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని నర్సాపూర్– కథలాపూర్ మండలం భూషణరావుపేట మధ్య డబుల్ రోడ్డు పనులకు ఆదివారం ఆయన భూమిపూజ చేశారు. మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి విన్నపం మేరకు రూ.12కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. రాళ్లవాగు ప్రాజెక్టు కుడికాలువకు గండి పడకుండా పనులు పకడ్బందీగా చేపట్టాలని బాపురెడ్డి విన్నవించారు. ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, బీఆర్‌ఎస్ నాయకులు కడింగం శేఖర్‌రెడ్డి, దూలూర్ శేఖర్ రెడ్డి, కృష్ణారెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేత



నియామక పత్రాలు అందిస్తున్న డీఈవో

జగిత్యాల: జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఎంపికైన 30మంది మహిళా అధ్యాపకులకు డీఈవో జగన్మోహన్‌రెడ్డి ఆదివారం నియామక పత్రాలు అందజేశారు. నియామక పత్రాలు పొందిన వారు వెంటనే విధుల్లో చేరాలని ఆయన సూచించారు.

పట్టణంలో తిరంగా ర్యాలీ



ర్యాలీలో బీజేపీ నాయకులు

జగిత్యాలటౌన్: ఆజాదీకా అమృత్ మహోత్సవాల ముగింపు సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా జాతీయ జెండాను గౌరవించడం అందరి బాధ్యతన్నారు. ఈనెల 15న ప్రతీఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని ఆయన కోరారు. నాయకులు దశరథ రెడ్డి, రెంటం జగదీశ్, జుంబర్తి దివాకర్, జున్ను రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ప్రభుత్వం అండ



నిరుద్యోగులతో చంద్రశేఖర్‌గౌడ్

జగిత్యాలటౌన్: ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా ఉంటుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి.చంద్రశేఖర్‌గౌడ్ అన్నారు. గ్రూప్–2 పరీక్షలు వాయిదా వేయడంపై ఆదివారం నిరుద్యోగులు జిల్లా ప్రధాన గ్రంథాలయంలో 'థాంక్స్ టూ కేసీఆర్.. థాంక్సు టూ తెలంగాణ గవర్నమెంట్' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సిబ్బంది, నిరుద్యోగులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

వివాదంలో ఆస్పత్రి భూములు

రాయికల్(జగిత్యాల): మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న రాయికల్.. ప్రస్తుతం మున్సిపాలిటీ హోదా దక్కించుకుంది. వ్యాపారాలు విస్తరిస్తున్నాయి. రియల్ ఎస్టేట్ రంగం వేగంగా పుంజుకుంటోంది. భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఎక్కడ ఖాళీ స్థలాలు కనిపించినా కబ్జాకు గురవుతున్నాయి. ఈక్రమంలోనే పట్టణ నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి చెందిన సుమారు ఇరవై గుంటలు ఆక్రమణకు గురైందని ఒకవర్గం ఆరోపిస్తే.. అది తమకు వారసత్వంగా సంక్రమించిందని మరోవర్గం అంటోంది. బహిరంగ మార్కెట్‌లో 20గుంటల విలువ సుమారు రూ.8కోట్లకు పైగానే ధర పలుకుతోంది. ఇంతకీ ఆ భూముల కథాకమామిషు ఏమిటంటే..

- కబ్జా చేసేందుకు జోరుగా ప్రయత్నాలు
- బహిరంగ మార్కెట్‌లో 20 గుంటలకు రూ.8కోట్ల పైనే..
- పరిరక్షణ కోసం రంగంలోకి దిగిన రాజకీయ నేతలు
- స్వాధీనంలోకి తీసుకున్నామంటున్న రెవెన్యూ అధికారులు
- వారసత్వంగా సంక్రమించాయంటున్న విక్రయదారులు



వివాదస్పదమైన భూములు ఇవే..

సాక్షి ఫోటో

3.6 ఎకరాల విస్తీర్ణంలో ఆస్పత్రి..

- రాయికల్ ఆస్పత్రి.. సర్వే నంబర్ 51, 52ల్లోని 3.6ఎకరాల విస్తీర్ణంలో ఉంది.
- సర్వే నంబర్ 52లో ధర్మపురి నర్సయ్య 1.12 ఎకరాలు, బల్సు నర్సయ్య 0.32 ఎకరాలు, టి.లింగయ్య 0.21 ఎకరాలు, తోట గంగారం 0.21ఎకరాలను ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటు కోసం 1964లో రాయికల్ గ్రామ పంచాయతీకి విరాళంగా అప్పగించారు.
- అయితే, బెజ్జారపు లింబాద్రి.. తోట గంగారాం నుంచి 1974లో సేల్స్ డీడ్ నంబరు 1703/74 ద్వారా కొనుగోలు చేసినట్లు దస్తావేజులు సృష్టించి తమ పేరిట చేసుకున్నారని కొందరు కోర్టులో ఫిర్యాదు చేశారు.
- వాదోపవాదాలు విన్న అప్పటి ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోర్టు.. సర్వే నంబరు 51, 52లోని 3.6ఎకరాలను ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం కోసం దాతలు విరాళంగా ఇచ్చారని తీర్పు చెప్పింది.

రెవెన్యూ రికార్డుల్లో ఏముందంటే..?

- ప్రభుత్వ ఆస్పత్రికి సర్వే నంబరు 51, 52ల్లో 3.6 ఎకరాలు ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో ఉంది. ఇందులో కేవలం 80గుంటల్లోనే ఆస్పత్రి భవనం నిర్మించారని చెబుతున్నారు. హద్దులపై ఇప్పటికీ స్పష్టత లేదు. దీంతో అక్రమార్కులు ఈ భూములపై కన్నేశారని అంటున్నారు. ఎవరికి వారే కబ్జా చేస్తున్నారని పేర్కొంటున్నారు. రెవెన్యూ రికార్డుల్లో తమ పేర్లు చేర్చుకునేందుకు రూ.లక్షలు మామూళ్లు ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

వివాదం ఇలా..

ఆస్పత్రి ఆవరణలోని ఇరవై గుంటల్లో భవన నిర్మాణం కోసం పట్టణానికి చెందిన బెజ్జారపు లింబాద్రి బల్దియా నుంచి అనుమతి పొందాడు. ఈ స్థలాన్ని ఆక్రమించి, అక్రమంగా నిర్మాణం చేపట్టారంటూ మున్సిపల్ పాలకవర్గం, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కలిసి అప్పట్లోనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన అధికారులు.. అది అక్రమమని తేల్చి అనుమతి రద్దు చేశారు. 25 ఫిబ్రవరి 2022లో అనుమతి ఇచ్చిన మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ తహసీల్దార్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌పై వేటువేశారు.

వారసులమంటూ తెరపైకి..

అయితే, బల్సు నర్సయ్య వారసులమంటూ బల్సు భూమక్క భూమన్న, బల్సు లక్ష్మి తెరపైకి వచ్చారు. సర్వే నంబరు 52/అ/2లోని 1,270.50 చదరపు గజాలను తడగొండ విజయ్‌కుమార్, కనపర్తి రమణారావు, కాసర్ల వెంకటేశానికి విక్రయించినట్లు తెలిపారు. కొనుగోలుదారులు అందులో షెడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే, ఫేక్ డాక్యుమెంట్లతో పనులు చేపట్టారని, వీటిని రద్దు చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మరోసారి కలెక్టర్, సబ్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన కలెక్టర్ యాస్మిన్‌బాషా.. అవి తప్పుడు డాక్యుమెంట్లేనని నిర్ధారించారు. వాటిని రద్దు చేస్తూ గత జూన్ 15న ఉత్తర్వులు జారీచేశారు. అయినా రెవెన్యూ అధికారులు ఆ భూములను స్వాధీనం చేసుకోలేదు.

ఆస్పత్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో..

ఆస్పత్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా భూముల కోసం ఉద్యమిస్తున్నారు. తేరుకున్న రెవెన్యూ అధికారులు.. అది ప్రభుత్వ స్థలమేనని పేర్కొంటూ అక్కడ బోర్డు ఏర్పాటు చేసేందుకు యత్నించారు. కానీ, ఆ ప్రయత్నం విఫలమైంది. ఈ స్థలంపై కోర్టులో కేసు ఉందని, ఇప్పటికే స్టేటస్ కో తీసుకొచ్చామని, తాము బల్సు రంజిత్ నుంచి కొనుగోలు చేశామని కనపర్తి రమణారావు చెబుతున్నారు.

వారసత్వంగా వచ్చింది



ఆస్పత్రి సమీప 52 సర్వే నంబరులోని భూమి వారసత్వంగా సంక్రమించింది. నా అవసరాల కోసం విజయ్‌కుమార్, రమణారావు, వెంకటేశంకు విక్రయించా. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో కబ్జా చేస్తున్నారనడం బాధాకరం.

– బల్సు రంజిత్, భూముల వారసుడు

కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం



బెజ్జారపు లింబాద్రి తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో అనుమతి పొంది భవన నిర్మాణానికి యత్నించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. పాలకవర్గం తీర్మానం తర్వాత అనుమతులు రద్దు చేశారు.

– మోర హన్మాండ్లు, మున్సిపల్ చైర్మన్, రాయికల్

పోరాటం చేస్తున్నాం



రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రి భూములు అన్యాక్రాంతం కాకుండా న్యాయ పోరాటం చేస్తున్నాం. పార్టీలకు అతీతంగా నాయకులు కలిసి వస్తున్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఆస్పత్రి భూములు కాపాడుతాం.

– జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ

అధీనంలోకి తీసుకున్నాం



కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆస్పత్రి భూములను రెవెన్యూ శాఖ అధీనంలోకి తీసుకుంది. కోర్టులో కేసు ఉందని భూయజమానులు స్టేటస్‌కో తీసుకొచ్చారు. దీంతో ఈ విషయాన్ని మళ్లీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం.

– ఖయ్యూం, తహసీల్దార్, రాయికల్

పంపకాల పంచాయితీ

- రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో 'మామూళ్లు'
- డాక్యుమెంట్ రైటర్లతో సిబ్బంది కుమ్మక్కు!
- వివాదాలకు దారితీస్తున్న వసూళ్లు!

మెట్‌పల్లి(కోరుట్ల): జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చోటుచేసుకునే రిజిస్ట్రేషన్లలో పారదర్శకత లోపిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమాలకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆన్‌లైన్ విధానం అమల్లోకి తీసుకొచ్చింది. కానీ, కార్యాలయ సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు కుమ్మక్కై దరఖాస్తుదారుల నుంచి అడ్డగోలుగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఆన్‌లైన్ పద్ధతిని కాదని చాలామంది ఇప్పటికీ డాక్యుమెంట్ రైటర్లనే ఆశ్రయిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు సిబ్బంది అందినకాడికి దండుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పంపకాల విషయంలో విభేదాలు తలెత్తి అటు రైటర్లు, ఇటు సిబ్బంది మధ్య గొడవలు జరుగుతున్నాయని తెలుస్తోంది. ఇటీవల మెట్‌పల్లిలో జరిగిన సంఘటనే దీనికి నిదర్శనమనే ప్రచారం సాగుతోంది.

జిల్లాలో నాలుగు కార్యాలయాలు

- జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, మల్యాలల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి.
- గతంలో వ్యవసాయ, వ్యవసాయేతర రిజిస్ట్రేషన్లు అన్నీ ఈ కార్యాలయాల్లోనే జరిగేవి.
- ప్రస్తుతం వ్యవసాయేతర రిజిస్ట్రేషన్లు జరిగేలా ప్రభుత్వం కొంతకాలం క్రితం నిబంధనల్లో మార్పులు చేసింది.
- ఒక్కో కార్యాలయ పరిధిలో ప్రతీరోజు 10 నుంచి 20 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.
- నెలకు రిజిస్ట్రేషన్ల లావాదేవీల ద్వారా ప్రభుత్వానికి రూ.50లక్షలకు పైగానే ఆదాయం సమకూరుతోంది.

అంతా వారి కనుసన్నల్లోనే..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు డాక్యుమెంట్ రైటర్ల కనుసన్నల్లోనే సాగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. వాస్తవానికి కార్యాలయాల సిబ్బంది, రైటర్లు కలిసి పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం.. రైటర్లతో అవసరం లేకుండా ఆన్‌లైన్ విధానాన్ని తీసుకొచ్చింది. అయినా ఇప్పటికీ ప్రతీకార్యాలయంలో రైటర్ల హవానే కొనసాగుతోంది. సిబ్బంది అవినీతి మరకలు తమకు అంటకుండా లావాదేవీలన్నీ రైటర్ల కనుసన్నల్లోనే సాగేలా ప్రోత్సహిస్తున్నారు. ఒక్క మెట్‌పల్లిలోనే 20మంది రైటర్లు ఉన్నారు. జిల్లా మొత్తమ్మీద 75మందికి పైగానే డాక్యుమెంట్ రైటర్లు ఉన్నట్లు సమాచారం. నిబంధనల ప్రకారం అన్నిపత్రాలు సక్రమంగా ఉన్న డాక్యుమెంట్‌కు రైటర్లు రూ.2వేల నుంచి రూ.3వేల వరకు వసూలు చేస్తున్నారు. ఏఒక్క లోపం ఉన్నా డాక్యుమెంట్‌ను రిజిస్ట్రేషన్ చేయాలంటే స్థలాల విలువను బట్టి రూ.10వేల నుంచి రూ.లక్షల్లోనే దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఇలా వచ్చిన సొమ్మును రైటర్లు, సిబ్బంది వాటాల రూపంలో పంచుకుంటున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.



ఇది మెట్‌పల్లిలోని డాక్యుమెంట్ రైటర్ మాదాస్తు రవితేజ కార్యాలయం. ఈనెల 3న కొందరు కార్యాలయంలోకి ప్రవేశించి ఆయనపై దాడిచేశారు. ఫర్నిచర్ ధ్వంసం చేశారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ బానావత్ తిరుపతి ఈ దాడి చేయించారని బాధితుడు ఆరోపించారు. ఈమేరకు అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు.. రవితేజతోపాటు మరోఇద్దరు కలిసి తన విధులకు ఆటంకం కలిగించారని తిరుపతి ఈనెల 5తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, రిజిస్ట్రేషన్ లావాదేవీల్లో తలెత్తిన విభేదాలే ఇందుకు దారితీశాయని తెలిసింది.

చర్యలు తీసుకుంటాం

రిజిస్ట్రేషన్ల విషయంలో ఎవరు ఇబ్బందులకు గురిచేసినా మా దృష్టికి తీసుకురండి. కొందరి తీరుతో విమర్శలు వస్తున్నాయి. ఇకనుంచి అలాంటివి రాకుండా చర్యలు తీసుకుంటాం. ప్రధానంగా జూనియర్ అసిస్టెంట్ తిరుపతి, డాక్యుమెంట్ రైటర్ రవితేజ వ్యవహారంలో కేసు నమోదైంది. పోలీసులు విచారణ జరుపుతున్నారు.

– శ్రీనివాసాచారి, సబ్ రిజిస్ట్రార్, మెట్‌పల్లి

మెట్‌పల్లిలో రెండు ఫిర్యాదులపై కేసులు..

- మెట్‌పల్లిలో డాక్యుమెంట్ రైటర్ రవితేజ, జూనియర్ అసిస్టెంట్ తిరుపతి ఇచ్చిన వేర్వేరు ఫిర్యాదులపై పోలీసులు కేసులు నమోదు చేశారు.
- పాత గొడవలను మనసులో పెట్టుకొని తిరుపతి తన ముగ్గురు అనుచరులతో దాడి చేయించారని రవితేజ ఫిర్యాదు చేశారు.
- ఓ రిజిస్ట్రేషన్ విషయంలో రవితేజతోపాటు సోలాంకర్ బాలాజీ, పిప్పెర రాజేశ్ ఇబ్బందులకు గురిచేయడంతోపాటు విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదు చేశారు.
- ఇందులో తిరుపతి అధికార బీఆర్‌ఎస్‌కు చెందిన రాయికల్ జెడ్పీటీసీ అశ్విని భర్త, పిప్పెర రాజేశ్ మెట్‌పల్లి మున్సిపల్ కౌన్సిలర్ లత భర్త కావడం గమనార్హం.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు

- ఎస్పీ భాస్కర్



ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ భాస్కర్ హెచ్చరించారు. తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మద్యం తాగే బహిరంగ ప్రదేశాల్లో నిఘా పటిష్టం చేశామన్నారు. గత జనవరి నుంచి ఇప్పటివరకు 4,140మందిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. రాత్రి సమయాల్లో వెలుగులు తక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి, మరింత సమర్థవంతంగా పెట్రోలింగ్ చేస్తామని చెప్పారు. పెట్రోకార్స్, పోలీస్ సిబ్బంది బహిరంగ ప్రాంతాల్లో నిత్యం పెట్రోలింగ్ చేస్తూ మద్యం తాగేవారిని కట్టడి చేస్తారని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత ఏడు నెలల్లో 5,220 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైన వారిపై 304 సెక్షన్ కేసులు నమోదు చేశామని అన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ట్రాఫిక్ అవేర్‌నెస్ కోసం రోడ్డు సేఫ్టీ డిజిటల్ స్క్రీన్ కలిగిన బస్ ద్వారా జిల్లాలో ప్రదర్శనలు చేపడుతున్నామని వివరించారు. ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని ఎస్పీ తెలిపారు.

కాంగ్రెస్‌తోనే పేదల జీవితాల్లో వెలుగులు

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



యువకులను ఆహ్వానిస్తున్న లక్ష్మణ్‌కుమార్

పెగడపల్లి(ధర్మపురి): కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. స్థానిక కార్యాలయంలో పెగడపల్లికి చెందిన యువకులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. లక్ష్మణ్‌కుమార్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యేగా, విప్‌గా, మంత్రిగా కొప్పుల ఈశ్వర్ పెగడపల్లిని ఏమాత్రం అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీకే మంత్రి పరిమితమయ్యారని దుయ్యబట్టారు. నామాపూర్, దీకొండలో కాళేశ్వరం లింక్– 2 ప్రాజెక్టు కింద వందల ఎకరాలు కోల్పోయారని, రైతులకు పరిహారం ఇప్పించడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. భారీవర్షాలతో పంటలు నష్టపోయి, ఇసుక మేటలు వేసి భూములు పనికిరాకుండా పోయాయని, బాధితులకు తక్షణమే పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శోభారాణి, నాయకులు మల్లారెడ్డి, శంకర్, శ్రీనివాస్, రాజు, విజయ భాస్కర్, అనిల్‌గౌడ్, ప్రవీణ్, సుధీర్, సత్యనారాయణరెడ్డి, రవి, సత్తయ్య, సతీశ్, రమేశ్, శ్రీకాంత్‌రెడ్డి, పవన్ రెడ్డి, ఎల్లయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

తరలివచ్చిన నేతన్నల దండు

- ఆత్మగౌరవ సభ సక్సెస్
- హాజరైన సుమారు 50 వేల మంది కులబాంధవులు
- కీలక తీర్మానాలకు ఆమోదం

కోరుట్ల: నేతన్నల దండు కదిలింది.. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన పద్మశాలీలతో పట్టణం రద్దీగా మారింది. ఆత్మగౌరవ యుద్ధభేరి సభ పరిసరాలు కులబాంధవులతో కిక్కిరిసిపోయాయి. బస్సులు, కార్లు, ఇతర వాహనాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సభాస్థలికి చేరుకున్నారు. సుమారు 50వేల మంది హాజరైనట్లు నిర్వాహకులు అంచనా వేశారు.

ఫలించిన సమన్వయం

ఆత్మగౌరవ సభ నిర్వహణలో కీలక సూత్రధారి, మధ్యప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పద్మశాలీ సంఘం నేతలను రెండునెలల పాటు సమన్వయపరిచారు. ఆత్మగౌరవ సభకు చైర్మన్‌గా వ్యవహరించిన నిజామాబాద్ పద్మశాలీ సంఘం నాయకుడు బసవ లక్ష్మీనారాయణ, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు, ఆత్మగౌరవ సభాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్ అన్ని జిల్లాల కులబాంధవులతో తరచూ మాట్లాడారు. సభ సక్సెస్ కోసం కృషి చేశారు. కోరుట్లలో సభావేదిక ఏర్పాటుతోపాటు అధిక సంఖ్యలో జనసమీకరణ చేయడంలో నాయకులు రుద్ర శ్రీనివాస్, జక్కుల ప్రసాద్, గుంటుక చంద్రప్రకాశ్, గద్దం మధు, గుడ్ల మనోహర్, జిల్లా ధనుంజయ్ చక్కగా పనిచేశారు. సుమారు రూ.70 లక్షలు వెచ్చించి జర్మనీ టెక్నాలజీతో సభా ప్రాంగణం ఏర్పాటు చేశారు. సభకు తరలివచ్చిన వారికి భోజన వసతి కల్పించారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కావేరీ గార్డెన్స్, సాయిబాబా ఆలయాల్లో వసతులు కల్పించారు.



మగ్గంపై నేస్తున్న నేతకార్మికురాలు



సభకు హాజరైన పద్మశాలీ కులబాంధవులు

ఇదీ కోరుట్ల డిక్లరేషన్..

- పద్మశాలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొద్దుల లక్ష్మణ్ ఆత్మగౌరవ సభలో పలు రాజకీయ తీర్మానాలు ప్రవేశ పెట్టారు.
- పద్మశాలీలను నిర్లక్ష్యం చేస్తున్న రాజకీయ పార్టీల కళ్లు తెరిపించాలి.
- వార్డు నుంచి పార్లమెంట్ సభ్యుడి వరకు అన్నిస్థానాల్లో దామాషా పద్ధతిన టికెట్లు కేటాయించాలి.
- పద్మశాలీ జనాభా అధికంగా ఉన్నప్రాంతాల్లో వారికే టికెట్లు ఇవ్వాలి. మరో బీసీ సామాజిక వర్గం సంఖ్య అధికంగా ఉంటే వారికి మద్దతు ఇవ్వాలి.
- రాజకీయాలను పక్కనబెట్టి పద్మశాలీ అభ్యర్థులను గెలిపించుకోవడం కోసం ఏకతాటిపైకి రావాలి.
- 'అభివృద్ధి, సంక్షేమం కోసం రాజ్యాధికారం' సిద్ధాంతం అనుసరించాలి.
- రాజకీయంగా బలపడితేనే వర్తమానం, భవిష్యత్ ఉంటుంది. ఓటు బ్యాంకుగా మారి గెలుపోటములను తారుమారు చేయాలి.
- రాష్ట్రంలోని 24 సెగ్మెంట్లలో పద్మశాలీల సంఖ్య అధికంగా ఉంది. ఈ స్థానాల్లో పార్టీలు పద్మశాలీలకు టికెట్లు ఇవ్వాలి.

అందరూ సహకరించారు



కోరుట్లలో పద్మశాలీల ఆత్మగౌరవ సభ ఏర్పాటు చేయాలని రాష్ట్ర నాయకత్వాన్ని కోరాం. అందుకు సమ్మతించడంతో రెండు నెలలు శ్రమించాం. జిల్లా, రాష్ట్రనాయకులు సహకరించారు.

– రుద్ర శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు, పద్మశాలీ సంఘం

సంఘటితశక్తి కీలకం



సంఘటితశక్తితో ఏదైనా సాధ్యమే. ఈదిశగా ముందుకు సాగేందుకు ఓ అడుగు ముందుకు పడింది. చట్టసభలు, రాజకీయంగా పద్మశాలీ, బీసీ నేతలకు మంచి ప్రాధాన్యం వస్తుందన్న నమ్మకం ఉంది.

– పరికిపండ్ల నరహరి, చీఫ్ సెక్రటరీ, మధ్యప్రదేశ్

శ్రమ ఫలించింది



పద్మశాలీలను సంఘటితం చేయాలన్న లక్ష్యం ఫలించింది. దీనికోసం ఐఏఎస్ పరికిపండ్ల నరహరి సహకారం మరువలేనిది. ఇదే రీతిలో పద్మశాలీలను చైతన్యం చేసి అధిక స్థానాలతో చట్టసభల్లోకి వెళ్తాం.

– బసవ లక్ష్మీనర్సయ్య, ఆత్మగౌరవ సభ చైర్మన్

సభ సక్సెస్



పద్మశాలీల ఆత్మగౌరవ సభ సక్సెస్ అయింది. కులబాంధవుల్లో చైతన్యం కలిగించాం. చేనేతలకు అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. కొత్త పథకాలు చేనేతలను ఆదుకుంటాయి.

– ఎల్.రమణ, ఎమ్మెల్సీ

సంతోషంగా ఉంది



ఆత్మగౌరవ సభ సక్సెస్ కావడం సంతోషంగా ఉంది. పద్మశాలీల్లో చైతన్యానికి పునాదులు పడుతున్నాయి. భవిష్యత్‌లో సామాజిక, రాజకీయంగా ఎదగడానికి అవకాశాలు ఇంకా పెరుగుతాయి.

– భోగ శ్రావణి, బీజేపీ, నాయకురాలు

క్లుప్తంగా

'ఉమ్మడి' షూటింగ్ బాల్ పోటీలకు స్పందన



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్: షూటింగ్ బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని సప్తగిరికాలనీ హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన 42వ అండర్-19 ఉమ్మడి జిల్లాస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు స్పందన లభించింది. 250 మందికి పైగా క్రీడాకారులు హాజరైనట్లు సంఘం కార్యదర్శి ఎండీ.ముఫాజిల్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 20న జనగాం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. పీడీ, పీఈటీలు ఇనాక్, శ్రీధర్, మహేశ్, రమేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీకి అభినందన



ట్రాఫిక్ రూల్స్‌పై పాట లోగో

జగిత్యాలక్రైం: ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం.. మద్యం తాగి డ్రైవింగ్ చేయడం... త్రిబుల్ రైడింగ్‌తో ప్రమాదాలకు గురై మృతిచెందితే ఆ కుటుంబం పడే బాధలను ప్రజలకు వివరిస్తూ ఎస్పీ భాస్కర్ రాసిన చేజారిన కొడుకు..అనే పాటను రూపొందించారు. ఈ సీడీని శుక్రవారం సాయంత్రం డీజీపీ అంజన్‌కుమార్ విడుదల చేయడంతోపాటు ఎస్పీ భాస్కర్‌ను ట్విట్టర్ ద్వారా ప్రత్యేకంగా అభినందించారు.

మైనర్ బాలికకు వేధింపులు

- ఇద్దరిపై కేసు నమోదు

మెట్‌పల్లి: ఓ మైనర్ బాలికను వేధించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యాం రాజ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఆరపేటకు చెందిన ఓ మైనర్ బాలిక (17)కు తమ బంధువైన ఫరీదా అనే మహిళ పని చూపిస్తానని నమ్మించి ఆదివారం ఆటోలో వెంకట్రావుపేట శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లింది. అక్కడికి వెళ్లిన తర్వాత ఫరీదా చౌలమద్దికి చెందిన గడ్డం హన్మాండ్లుకు ఫోన్ చేసి రప్పించి బాలికను అతనికి అప్పగించింది. హన్మాండ్లు లైంగికంగా వేధించడమే కాకుండా చంపుతానని బెదిరించి అక్కడి నుంచి పంపించేశాడు. ఈ విషయాన్ని బాలిక కుటుంబ సభ్యులకు తెలిపింది. వారి ఫిర్యాదు మేరకు ఫరీదా, హన్మాండ్లుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బీడీ కార్మికుల సమస్యలపై నిరంతం పోరాటం

సిరిసిల్లటౌన్: బీడీ కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం చేస్తామని తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం (బీఎల్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు ముద్రకోల ఆంజనేయులు తెలిపారు. ఆదివారం సిరిసిల్లలో విలేకరులతో ఆయన మాట్లాడారు. బీడీ కార్మికులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా జీవనభృతి ఇవ్వాలని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2016 పింఛన్ అందించాలని, ప్యాకర్లు, టేకేదార్లు, బట్టీవాలా, చాటావాలల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సోమవారం ఉదయం సిరిసిల్ల కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలన్నారు.

మీనం .. మరింత జాప్యం

- ఆలస్యంగా టెండర్ పూర్తి..
- పొరుగు రాష్ట్రాల చేప పిల్లలకు ఫుల్‌స్టాప్
- స్థానికంగా పెంచిన వాటిపైనే ప్రభుత్వం దృష్టి
- ఈనెలలో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు

ధర్మపురి : వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలుకాగా జూలై, ఆగస్టులో కురిసిన భారీ వర్షాలతో చెరువులు, కుంటలు నిండి జలకళ సంతరించుకున్నాయి. ప్రభుత్వం అందించే చేప పిల్లలను సకాలంలో అందించకపోవడంతో పాటు టెండర్ల ప్రక్రియ కారణంగా పంపిణీ ఆలస్యమవుతోంది. ఎట్టకేలకు టెండర్ల ప్రక్రియ ముగియగా ఈ నెలలో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో కొన్నిచోట్ల మత్స్యకారులు ప్రైవేట్‌గా చేపపిల్లలు కొని చెరువుల్లో పోశారు. తర్వాత ప్రభుత్వం అందించే చేపపిల్ల పంపిణీతో ఆర్థికంగా నష్టపోవాల్సిన వస్తుందని పలువురు భావిస్తున్నారు. జిల్లాలో చేప పిల్లల పంపిణీపై కథనం ..



చెరువులో చేపపిల్లలు వదులుతున్న అధికారులు (ఫైల్)

టార్గెట్ 1.67 కోట్లు

జిల్లాలోని 18 మండలాల్లో 720 జల వనరుల్లో మొత్తం 1.67 కోట్ల చేప పిల్లల్లో చిన్నవి 47 లక్షలు, పెద్దసైజు 1.20 కోట్ల చేప పిల్లలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. అందుకు జిల్లాలోని హన్నాబాద్‌లోని జలపుష్టి ఓ ప్రైవేట్ సంస్థ 1.33 కోట్ల చేప పిల్లలకు టెండర్ దక్కించుకుంది. బీర్‌పూర్ మండలంలోని బీష్మా ఫిష్ ఫాం ప్రైవేట్ పెంపుదల కేంద్రం 25 లక్షలకు టెండర్ దక్కించుకుకుంది. జిల్లాలో 239 సంఘాలుండగా వాటిలో 50 మహిళా మత్స్యకార సంఘాలు, 189 మత్స్య పారిశ్రామిక సంఘాలు ఉన్నాయి. పెద్ద జలాశయమైన ఎల్లంపెల్లి బ్యాకు వాటర్‌లోనే 5.62 లక్షల చేపపిల్లలు వదిలేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అధికారికంగా లెక్కలున్నా నిబంధనలకు విరుద్ధంగా పంపిణీ చేస్తున్నారు. ఒక చెరువులో లక్ష చేప పిల్లలను వదలాలని ఉన్నా 30 నుంచి 40వేలు పోసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ప్రభుత్వం ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది.

స్థానికంగా ఉత్పత్తి చేసినవే..

గతంలో పలురాష్ట్రాల్లో ఉత్పత్తి చేసిన చేప పిల్లలను పంపిణీ చేయడంపై మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారనే ఆరోపణలున్నాయి. అధికారుల అండదండలతో గుత్తేదారులు ప్రభుత్వ పథకాన్ని నీరుగారుస్తున్నారు. దీంతో ప్రభుత్వం ఈ సంవత్సరం నుంచి స్థానికంగా ఉత్పత్తి చేసిన చేప పిల్లలనే పంపిణీ చేసేందుకు సిద్ధమవుతోంది. అందుకు హస్నాబాద్‌లోని జలపుష్టి, బీర్‌పూర్ మండలంలోని రంగసాగర్‌లో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేశారు. అక్కడ పెంచిన వాటినే అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

ఏటా రూ.2 కోట్ల వరకు

మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏటా రూ.2 కోట్ల వరకు ఖర్చుచేస్తుంది. వాటిలో చిన్న పిల్లలకు రూ.60 పైసలు, పెద్ద పిల్లలకు రూ.1.60 పైసల చొప్పున ప్రభుత్వం గుత్తేదారులకు చెల్లిస్తుంది.

జిల్లా ప్రొఫైల్

మత్స్యకారులు	:18000
మత్స్యసంఘాలు	:239
జల వనరులు	:720
చేప పిల్లలు	:1.67 కోట్లు

పంపిణీకి సిద్ధం



టెండర్ల ప్రక్రియ పూర్తయింది. ఈనెలలో చేప పిల్లలను పంపిణీ చేసేందుకు సిద్ధం చేశాం. ప్రభుత్వ నిబంధనలకు అనుకూలంగా ప్రణాళికను రూపొందించాం. జిల్లాలో ఉత్పత్తి చేసిన చేప పిల్లలు అందిస్తాం. మొత్తం 1.67 కోట్ల చేప పిల్లలు పంపిణీ చేస్తాం.

– దామోదర్, జిల్లా మత్స్యశాఖ అధికారి

'దళితబంధు' ఓట్ల కోసం కాదు



పంచాయతీ భవనం ప్రారంభిస్తున్న వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రవిశంకర్, తదితరులు

- ప్రణాళిక సంఘంఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

కొండగట్టు(చొప్పదండి): దళితబంధు పథకం ప్రవేశపెట్టింది ఓట్ల కోసం కాదని, దళితుల అభివృద్ధి కోసమని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. కొడిమ్యాల మండలంలోని పలు గ్రామాల్లో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత శనివారంపేట గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రారంభించారు. హిమ్మత్‌రావుపేటలో రూ.80 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ధాన్యం దిగుబడిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందన్నారు. గురుకుల పాఠశాలలు 1,000కి చేరుకున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డులన్నీ తెలంగాణకే వస్తున్నాయని అన్నారు. దేశభక్తి బీజేపీ సొత్తు కాదన్నారు. మతం పేరిట ఎక్కడా అభివృద్ధి జరగలేదని పేర్కొన్నారు. ప్రతీ విద్యార్థి ప్రభుత్వం 1.25లక్షలు వెచ్చిస్తోందని తెలిపారు. అనంతరం మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు సల్మాన్ ఆధ్వర్యంలో 700మంది యువకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. సర్పంచులు పునుగోటి కృష్ణారావు, బందరి ఎల్లవ్వ, మిట్టపెల్లి సుదర్శన్, జెడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి, నాయకులు మేనేని రాజనర్సింగరావు, మై విలేజ్ షో గంగవ్వ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: కాంగ్రెస్ పాలనలోనే జగిత్యాల అభివృద్ధి చెందిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలకు ఈ విషయాలను వివరించాలన్నారు. స్థానిక ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఇప్పటికీ అర్హులైన వారికి రేషన్‌కార్డులు జారీచేయకపోవడం బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శమన్నారు. 2018–19లో రాష్ట్రంలో స్వయం ఉపాధి కోసం కేవలం 1,400మందికే ఆర్థిక సాయం చేయడం శోచనీయమన్నారు. కాంగ్రెస్‌పాలనలో బియ్యంతోపాటు తొమ్మిది రకాల నిత్యావసరాలు పంపిణీ చేశామని గుర్తుచేశారు. నాయకులు కొత్త మోహన్, గిరి నాగభూషణం, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, పుప్పాల అశోక్, ముంజాల రఘువీర్ గౌడ్, గుండ మధు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యం



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా ఎల్‌ఎం కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ముందుకు సాగుతోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. స్థానిక శ్రీలక్ష్మీనరసింహా ఫంక్షన్‌హాల్‌లో ఎల్‌ఎం కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్, భారత్ జాగృతి ఆధ్వర్యంలో ఆదివారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఎల్‌ఎం కొప్పుల చారిటేబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ కొప్పుల స్నేహలత అధ్యక్షతన జాబ్ మేళా జరిగింది. మంత్రి కొప్పుల మాట్లాడుతూ, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఐటీ, ఫార్మా, ఇండస్ట్రియల్, ఆస్పత్రులకు చెందిన సుమారు 60 కంపెనీలు హైదరాబాద్, కరీంనగర్ నుంచి తరలిరావడం సంతృప్తినిచ్చిందన్నారు. ఇందులో 4 వేల వరకు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదివిన వారికి మంచి ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. అంతకముందు ట్రస్ట్ చైర్‌పర్సన్ స్నేహలత మాట్లాడారు. 50 సేల్స్ ఎక్సిక్యూటివ్, 10 గ్రూప్ లీడర్, 5 టీమ్ మేనేజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వరంగల్, మహబూబ్‌నగర్, మహబూబాబాద్, గుంటూరు, కర్నూలు జిల్లాల్లో వీటిని భర్తీచేస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, జాగృతి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు జమున, ఉపాధ్యక్షుడు సిరంగి సంతోష్, మండల అధ్యక్షురాలు రాపర్తి విజయలక్ష్మి, హెచ్‌ఆర్‌లు కోటేశ్వర్‌రావు, పరిమల తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

జగిత్యాలక్రైం : జిల్లా కేంద్రంలోని ఉస్మాన్‌పూర్‌లో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని శుక్రవారం రాత్రి పట్టణ పోలీసులు పట్టుకున్నారు. కొద్దిరోజులుగా ఉస్మాన్‌పూర్‌కు చెందిన ఓ వ్యక్తి రేషన్ బియ్యం కోనుగోలు చేస్తూ ఇంట్లో నిల్వ ఉంచగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఇంట్లోని 12 బస్తాల రేషన్‌బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మల్లాపూర్ : తాళం వేసిన ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని ముత్యంపేటలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన నిమ్మల లక్ష్మారెడ్డికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉపాధి కోసం లక్ష్మారెడ్డి గల్ఫ్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో భార్య పద్మ కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లింది. గుర్తు తెలియని తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి 8 గ్రాముల బంగారం, 10 తు లాల వెండి, రూ.50 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఆదివారం పద్మ ఇంటికి చేరుకోగా దొంగతనం జరిగినట్లు భావించి పోలీసులకు సమాచారం అందించింది. ఎస్సై నవీన్‌కుమార్, సిబ్బంది చేరుకొని క్లూస్ టీంతో విచారణ చేపట్టారు. పద్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అపరిచిత వ్యక్తుల సంచారం

కథలాపూర్: భీమారం మండలం వెంకట్రావుపేట గ్రామంలో శనివారం అర్ధరాత్రి అపరిచిత వ్యక్తులు సంచరించడం గ్రామంలో కలకలం రేపింది. గ్రామంలోని పత్రి చంద్రయ్య ఇంట్లోకి ఓ వ్యక్తి సంచరించి తలుపులు ధ్వంసం చేసినట్లు శబ్దం రావడంతో గ్రామస్తులు అప్రమత్తమై కేకలు వేశారు. దీంతో అపరిచిత వ్యక్తి అక్కడినుంచి పరారయ్యాడు. చిన్నారులను కిడ్నాప్ చేసేందుకు ఓ ముఠా మండలంలో సంచరిస్తుందని, ఆ ముఠా సభ్యులే వెంకట్రావుపేటలో సంచరించి చిన్నారులుండే ఇళ్లలోకి చొరబడే ప్రయత్నం చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. దీనిపై పోలీసులు ఆరాతీశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పెగడపల్లి: మండలంలోని లింగాపూర్‌కు చెందిన గజ్జి మౌనిక (29) చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. ఎస్సై సతీశ్ వివరాల ప్రకారం..మౌనిక కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. మనస్తాపానికి గురై ఈనెల 6న పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు చికిత్స ని మిత్తం ఆస్పత్రికి తరలించగా ఆదివారం చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు



అరెస్టు చూపుతున్న సీఐ కరుణాకర్

వేములవాడ : గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. పట్టణంలోని ఆర్‌బీఎం బేకరి వద్ద పోలీసులు తనిఖీలు చేయగా గంజాయి విక్రయిస్తున్న సిరిసిల్లకు చెందిన భూరాణి నరసింహ (38), వేములవాడలోని రాం మందిరం వీధికి చెందిన పర్రె శివకుమార్ (38)ను ఆదివారం అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. వీరి నుంచి వంద గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తే 100కు సమాచారం అందించాలని సీఐ పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

జగిత్యాలక్రైం: షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రంలోని అమీనాబాద్ ప్రాంతానికి చెందిన గంగాధర్ ఇంట్లో ఆదివారం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఇంట్లోని టీవీ, ఫ్రిజ్‌తోపాటు విలువైన సామగ్రి దగ్ధమైంది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు చేరుకొని మంటలను ఆర్పివేశారు. సుమారు రూ.2లక్షల విలువైన ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గోదావరిలో రిటైర్డ్ కార్మికుడి మృతదేహం



శంకరయ్య (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని రమేశ్‌నగర్‌కు చెందిన చెల్పూరి శంకరయ్య(64) అనే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు మూడు రోజుల క్రితం గోదావరి నదిలో దూకగా ఆయన మృతదేహం లభ్యమైంది. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరయ్య కొంత కాలంగా కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. మూడుసార్లు ఆపరేషన్ చేయించుకున్నా తగ్గకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 10న మందుల దుకాణానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి, వెళ్లాడు. తర్వాత గోదావరి బ్రిడ్జి వద్దకు చేరుకొని తన చెప్పులు, టవల్ అక్కడే వదిలేసి, నదిలో దూకాడు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల గాలించినా ఆయన ఆచూకీ లభించలేదు. చివరకు ఆదివారం జాలర్ల సాయంతో గోదావరి నదిలో వెతకగా బ్రిడ్జి కింద శంకరయ్య మృతదేహం లభ్యమైంది. పోలీసులు బయటకు తీయించి, పోస్టుమార్టం చేయించారు. మృతుడి కుమారుడు సతీశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ ఎస్సై ప్రసాద్‌రావు తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు



గాయపడిన రమేశ్

మల్లాపూర్ : ఈతచెట్టుపై నుంచి పడి ఓ గీత కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రేగుంటకు చెందిన మూడంపల్లి రమేశ్ (42) రోజూ మాదిరిగానే కల్లు గీసేందుకు ఈతచెట్టుకు ఎక్కగా ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రంగు రామాగౌడ్ రమేశ్‌ను పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

సీతారామాలయ నిర్మాణానికి నిధులు మంజూరు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలకేంద్రంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న సీతారాముల ఆలయ పునఃనిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ట్రస్ట్ ద్వారా ఆదివారం రూ.70 లక్షలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న మాట్లాడుతూ... మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో టీటీడీ మాజీ చైర్మన్, వైవీ.సుబ్బారెడ్డి గారికి విన్నవించగా నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిధులు మంజూరుకు సహకరకించిన బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సీతారామాలయం వేరేచోట నిర్మాణం చేపట్టనుండటంతో రోడ్డు విస్తరణ పనులు పూర్తయి ట్రాఫిక్ సమస్యలు తీరనున్నాయి.

'కలుపు' తో మరింత భారం

- పంట చేన్లలో కష్టంగా మారిన కలుపు తీత
- కలుపు తీసేందుకు దొరకని కూలీలు
- మల్చింగ్ షీట్‌పై రైతుల దృష్టి
- జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో ఆరుతడి పంటల సాగు



యశ్వంత్‌రావుపేటలో మల్చింగ్ షీట్‌పై మొక్కజొన్న సాగు



బీబీరాజ్‌పల్లిలో పత్తి చేనులో పెరిగిన కలుపు మొక్కలు

జగిత్యాలఅగ్రికల్చర్ : ఇటీవల కురిసిన వర్షాలతో పంట చేన్లలో పెరిగిన కలుపు మొక్కలు రైతులకు తీవ్ర సమస్యగా మారింది. కలుపు తీసేందుకు కూలీలు దొరక్కపోవడంతో పంటను మించి కలుపు మొక్కలు పెరిగాయి. దీంతో రైతులకు అదనపు ఖర్చు పెరుగుతోంది. కొందరు రైతులు కలుపు తీయించినా లాభం లేదంటూ పంటలు వదిలేస్తున్నారు. ఈ నేపథ్యంలో కూరగాయల సాగులో కలుపు మొక్కలు రాకుండా ఉపయోగించే మల్చింగ్ షీట్‌ను ఆరుతడి పంటలకు ఉపయోగిస్తున్నారు.

1.50 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగుచేయగా, అందులో ప్రధానంగా మొక్కజొన్న 43 వేల ఎకరాలు, పసుపు 35 వేలు, కంది 5 వేలు, పెసర 3 వేల ఎకరాలు, పత్తి 20 వేల ఎకరాల్లో సాగుచేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు తోటల్లో కలుపు మొక్కలు బాగా పెరిగాయి. పంటవేసే సమయంలో గడ్డి మందు కూడా పిచికారీ చేశారు. అయితే వర్షాలతో మందుల ప్రభావం చూపకపోవడంతో తుంగ, గరక వంటి కలుపు మొక్కలు పంటకు మించి పెరిగాయి. ఈలోపే రైతులు వరినాట్ల వైపు మొగ్గుచూపగా చేన్లలో విపరీతంగా కలుపుమొక్కలు పెరిగాయి. దీంతో కలుపు తీయాలా..వద్దా అనే ఆలోచనలో రైతులు ఉన్నారు.

కూలీల కొరత..

పంటలో కలుపు తీసేందుకు కూలీలు దొరకడం లేదు. ఒక్కో కూలీకి రోజూ రూ.300 నుంచి రూ.400 వరకు చెల్లిస్తామన్నా దొరకని పరిస్థితి. దీంతో మొక్కజొన్న వంటి పంటలకు మొదటి దఫా రసాయన ఎరువులు వేయడం లేదు. ఒకవేళ కలుపుతీసిన తోటల్లో కూలీలు తీసిన గడ్డి గుట్టలుగా పేరుకుపోతోంది. ప్రధాన పంటలు దెబ్బతినకుండా గడ్డి మందులు కొట్టే అవకాశం కూడా లేదు.

మల్చింగ్ షీట్‌ను ఉపయోగిస్తున్న రైతులు

రెండేళ్లుగా వర్షాలు బాగా కురవడం, కలుపు సమస్య పెరగడంతో, కొందరు రైతులు కలుపు మొక్కలు పెరగకుండా మల్చింగ్ షీట్‌ను ఉపయోగిస్తున్నారు. కూలీలకు పెట్టే ఖర్చుతో మల్చింగ్ షీట్‌ను కొనుగోలు చేస్తున్నారు. సాగుభూమిని భోజలు (గట్లు)గా తయారు చేసి, వాటిపై మల్చింగ్ షీట్‌ను పరుస్తున్నారు. మల్చింగ్ షీట్‌కు రంధ్రాలు చేసి, వాటిలో మొక్కజొన్న, కంది వంటి విత్తనాలు నాటారు. ఈ పద్ధతిని ఎక్కువగా కూరగాయాల సాగుకు ఉపయోగించేవారు. కానీ కూలీల సమస్య ఉండటంతో ఖర్చు ఎంతైనా మొక్కజొన్న, పసుపు వంటి పంటలకూ ఉపయోగిస్తున్నారు.

సబ్సిడీపై ఇవ్వాలి



ఆరుతడి పంటలతో పాటు కూరగాయలు సాగుచేసే రైతులకు సబ్సిడీపై మల్చింగ్ షీట్ అందించాలి. గ్రామాల్లో ఎన్ని డబ్బులు చెల్లిస్తామన్నా కూలీలు దొరకడం లేదు. దీంతో కూరగాయలతో పాటు ఆరుతడి పంటలకు మల్చింగ్ షీట్‌ను ఉపయోగిస్తున్నాం.

– బందారి వెంకటేశ్, సారంగాపూర్

ఆరుతడి పంటలో అధికం..



సాధారణంగా ఆరుతడి పంటల్లో కలుపు మొక్కల సమస్య ఉంటుంది. అయితే ఈ ఏడాది విస్తారంగా కురిసిన వర్షాలతో మొక్కజొన్న, పసుపు వంటి ఆరుతడి పంటల్లో కలుపు సమస్య ఎక్కువగా ఉంది. దీంతో రైతులకు మరింత అదనపు ఖర్చు పెరుగుతోంది.

– డాక్టర్ లక్ష్మీప్రసన్న, శాస్త్రవేత్త, పొలాస